# అమ్మ దాచిన రహస్యం

జి. రామకృష్ణ

రామ్మూర్తి ప్రోత్సాహం లేకపోతే నాకు అంత ధైర్యం వచ్చేదే కాదు. పైగా వాడు ఎన్నో గమ్మత్తు గమ్మత్తుమాటలు చెప్పి నన్ను వుబ్బేశాడు. ఆ సినిమాగురించి చిత్ర విచిత్రంగా చెప్పాడు. నిజమే కాబోలను కున్నాను. ఎలాగైనాసరే ఒక రూపాయి లంకించుకురమ్మని నా ప్రాణం కొరుక్కు తిన్నాడు. నావల్ల కాదంటే కాదన్నాను. వాడొప్పుకోలేదు. ఉపాయం వాడే చెప్పాడు. నాన్న జేబులోనుంచి రెండో కంటికి తెలియకుండా ఒక రూపాయి మాయంచేసి తీసుకురమ్మన్నాడు. వాడి కబుర్లకు లొంగిపోయి సరే తెస్తానన్నాను.

సినిమా ప్రారంభంచేది ఆరుంబావుకు. నాన్నవచ్చేది ఆరున్నరకి. అంటే మధ్య పావుగంట వ్యవధి వుంది. రామ్మూర్తి వీధి చివర రెడీగా నుంచున్నాడు నా కోసం, నే తెచ్చే రూపాయికోసం.

నాన్న మామూలు టైముకే ఇంటికి వచ్చాడు. కోటువిప్పి గదిలో స్టాండుకు తగిలించాడు. నాన్న స్నానంచేసి వచ్చే లోపుగా రూపాయి కొట్టేయాలి. లేకపోతే మరి అవకాశం చిక్కదు.

ఎప్పుడూ ఇలాటి తప్పుడుపనులు చేసి ఎరగను. భయంతో దడదడలాడిపోయాను. రామ్మూర్తి మాటలు గుర్తుకొచ్చాయి. కొంత ధైర్యం వచ్చింది.

అమ్మ వంటింట్లోవుంది. నాన్న స్నానానికి వెళ్లాడు. నేను నాన్న కోటుజేబులోనుంచి పర్సుతీసి ఒక రూపాయి కొట్టేశాను. గబగబా ఇవతలకు వచ్చేశాను.

'బోలెడన్ని లెక్కలు హోంవర్కిచ్చారు. రామ్మూర్తితో కలిసి చేసుకొస్తా' నని అమ్మతో చెప్పి బయటపడ్డాను.

దూరాన్నుంచే రామ్మూర్తి 'ఏరా గోపీ! కాయాపండా?' అని అరిచాడు.

నాకూ వుత్సాహంగానే వుంది గొప్ప సినిమా చూడబోతున్నాను గదా అని.

'పండేరా' అన్నాను.

ఇద్దరం చకచకా సినిమాహాలు చేరుకున్నాం. ఇసుకవేస్తే క్రిందరాలదు ఆ జనంలో. ఏ క్యూ చూసినా వాసుకి మాదిరి అంతూపొంతూ లేకుండా వుంది.

మా గుండెలు నీరైపోయాయి.

కాళ్లుకాలిన పిల్లులమాదిరి అన్ని కౌంటర్ల దగ్గరికీపోయి చూశాం. వెనక్కి పొమ్మని జనం కసురుతున్నారు. మరి పెద్ద తరగతి టిక్కెట్లుమాత్రం దొరుకుతాయి. మా దగ్గర వున్నది ఒక్కటే ఒక రూపాయి, రెండు టిక్కెట్లు కావాలి.

బుకింగ్ అయిపోయిందన్నారు. చాల మంది చిచ్చులు కొట్టుకుంటూ వెళ్ళిపోతున్నారు.

రామ్మూర్తీ, నేనూ కూడ చేసేదేమీ లేక తిరుగుముఖం పట్టాం.

రూపాయిమార్చి ఏమన్నా కొనుక్కు తిందామన్నాడు రామ్మూర్తి. కాని నాకే భయంవేసి వద్దన్నాను. ఇక లాభంలేదనుకుని వాడు వెళ్ళిపోయాడు.

నాన్న జేబులోనుంచి కాజేసినరూపాయి ఖర్చు కాకుండా నా జేబులోనే వుంది. జేబులో తేలుంటే ఎలా వుంటుందో అలా వుంది నాకు ఆరూపాయి నా జేబులో వున్నందుకు.

---

> ఎవడన్నా సాయం కావా
> లంటూ నాదగ్గరికొస్తే వాడి
> కెలాంటిసలహా కావాలో
> తెలుసుకుని అదే ఇస్తాను.
>
> —జోష్ బిలింగ్స్]

---

ఇల్లు చేరుకున్నాను. 'అప్పుడే వచ్చావేరా?' అని అమ్మ అడిగింది.

'రామ్మూర్తి లేడమ్మా, ఎక్కడికో వెళ్లాడు' అని జవాబిచ్చాను.

నాన్న గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. ఆ రూపాయి తిరిగి నాన్న జేబులో పెట్టడం నాతరంకాదు. నా జేబులోనే వుంటే ప్రమాదం. ఆ రూపాయి ఆరావచ్చి, నా జేబులు వెతకడం జరిగితే నా వీపు పగలడం ఖాయం.

ఇక రూపాయికి వంటింట్లో మెంతుల డబ్బా ఒక్కటే మంచిచోటు. అమ్మ పెరట్లోకి వెళ్ళగా చూసి నేను గభుమని వంటింట్లో దూరాను. రూపాయి మెంతుల డబ్బాలో పడేశాను. ఇవతలకు రాబోతుండగా అమ్మ వచ్చింది. 'వంటింట్లో ఏం పనిరా?' అని ప్రశ్నించింది.

తడబడుతూ 'మంచినీళ్ళకోసం వచ్చానమ్మా' అని చెప్పి కాసిని మంచినీళ్లుతాగి యివతలపడ్డాను.

భోజనాలయిపోయాయి. చదువేమీ సాగలేదు.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు. చేసినపని అమ్మతో చెపుదామా అనుకున్నాను. కాని ధైర్యంచాలలేదు. అమ్మ ఏమంటుందో అని జంకాను. నాన్నకు తెలిస్తే ఏమిగొడవవుతుందో అని భయపడ్డాను. ఆలోచిస్తూ ఆలోచిస్తూ వుండగా కునుకుపట్టింది.

మర్నాడు వుదయం నాన్న బజారుకు వెళ్తూ పర్సుతీసి చూసుకున్నాడు. రూపాయి తక్కువవున్నట్లు తెలిసింది. అమ్మను అడిగాడు. నాకేమీ తెలియదండీ అంది అమ్మ.

ఆ రూపాయిగురించి అమ్మకు, నాన్నకు కొంత వాదనజరిగింది. నాన్న గట్టిగా కేకలేశాడు.

'నీ డబ్బాలన్నీ సరిగా వెతుకు' అన్నాడు చివరకు కోపంగా.

"ఎందులోనూ లేవండీ, ఎందుకట్లా కోపం తెచ్చుకుంటారు" అంది అమ్మ.

ఈ సమాధానంతో నాన్నకోపం మరీ ఎక్కువయింది. నాన్నే స్వయంగా వంటింట్లోకివెళ్ళి డబ్బాలు మూతలుతీసి చూశాడు. మెంతులడబ్బాలో రూపాయి చూశాడు.

ఆ రూపాయి తీసుకొచ్చి 'ఇది ఎక్కడిది!' అని అమ్మవైపు చూస్తూ గట్టిగా అడిగాడు.

అమ్మ ఆశ్చర్యపోయింది. నోటమాట రాలేదు.

నాన్న ఆ కోపంతోనే రూపాయి అమ్మ మొహంపైన విసిరికొట్టి బజారు వెళ్ళిపోయాడు.

నేను హాలులో కూర్చుని అంతా చూస్తూనే వున్నాను. గజగజ వణికిపోయాను.

అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది. నాకూ ఏడుపువచ్చింది. ఏడ్చేశాను. అమ్మ నాదగ్గరకు వచ్చింది. అమ్మను కావలించుకుని బావురుమన్నాను. జరిగినదంతా అమ్మకు చెప్పేశాను. ఇంకెప్పుడూ ఇలాంటిపని చేయనని అమ్మకు హామీయిచ్చాను.

అమ్మ చిరునవ్వు నవ్వింది. 'భయం లేదులే. ఎప్పుడూ తప్పుపనులు చేయకూడదు. నాన్నతో చెప్పనులే' అని ధైర్యం చెప్పింది.

ఆ రహస్యం ఆనాటికీ యీనాటికీ అమ్మ తనగుండెలోనే దాచుకుంది.

★